## గిర్దావర్ బోనకల్ సమర్పించు

# రెవెన్యూ లీలలు

**-రచన దర్శకత్వం తహసీల్దార్ బోనకల్**




1980 దశకం వరకు తెలంగాణలో మునసబులు రైతుల జీవితాలతో చెలగాటమాడేవారు. భూ రికార్డుల వ్యవహారంలో వారు చెప్పిందే శాసనం. వీరి వ్యవహారాలను చూసి అనుభవించి అప్పట్లో 'భూ బాగోతం' 'నా భూమి దొంగలెత్తుకెళ్లారు' అనే రెండు నాటకాలను గ్రామీణ ప్రాంతాల్లో ప్రదర్శించి కర్ణం, మునసబుల గుట్టు రట్టు చేసేవారు. బంజర భూములు పట్టాభూములని పట్ట భూములు బంజర భూములని చిక్కులు తేగలను నేను చెక్కులు తేగలను అంటూ కర్ణం పాత్రదారి భూ రికార్డుల మార్చివేత ముప్పును వివరించే వారు. ఎన్‌టి రామారావు పుణ్యమా అని ఆ వ్యవస్థ రద్దయినా కొందరు రెవెన్యూ అధికారుల తీరు మాత్రం ఇప్పటికీ అందుకు భిన్నంగా లేదు. వారు తలచుకుంటే పట్ట భూమి ప్రభుత్వ భూమి, ప్రభుత్వ భూమి అసెన్డ్ భూమి, అసైన్డ్ భూమి ప్రభుత్వ భూమిగా మారిపోతుంది. బోనకల్ రెవెన్యూ అధికారులు అచ్చు అప్పటి కర్ణం, మునసబుల్లా ఇప్పుడు భూ రికార్డులను మార్చివేశారు. 2013 వరకు అది అసైన్డ్ భూమేనట. రైతు హక్కుభుక్తంలోనే ఉందట. 2013 తర్వాత అది ప్రభుత్వ భూమిగా మారిపోయిందట. ఎలా అంటే రికార్డుల్లో అలా ఉంది అంటున్నారు. కానీ రైతుకు ఇచ్చిన పహాణీ నకలులో మాత్రం అసైన్డ్ భూమిగానే ధృవీకరించారు. అంతే కాదు ఆ భూమిని సబ్ స్టేషన్‌కు కేటాయిస్తున్నట్లు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. కనీసం ఆ రైతుకు ఈ విషయాన్ని తెలియపర్చలేదు. అదేమని రైతు లబోదిబో మంటూ తహసీల్దార్ కార్యాలయంకు వెళితే ఆ భూమి నీదేనన్న ఆధారముందా అంటూ ప్రశ్నించడంతో పాటు కార్యాలయంలోకి రావద్దంటూ బెదిరించినంత పని చేశారు. ఆ తర్వాత విఠలాచార్య సినిమా చూపెట్టారు. సబ్ స్టేషన్‌కు కేటాయించడం, పనులు ప్రారంభించడం దానిని రైతు అడ్డుకుంటే పోలీసులను రంగంలోకి దింపడం జరిగిపోయింది. రంగంలోకి దిగిన పోలీసులు ఇది మాకు షరామామూలే అంటూ స్టేషన్‌కు తరలించడం ఆ వైపు చూడవద్దని హెచ్చరించడం జరిగిపోయాయి. గిర్దావర్ సమర్పణలో తహసీల్దార్ రచించిన ఈ సినిమా కథలోకి వెళితే మందడపు నారాయణకు బోనకల్ మండలం బ్రాహ్మణపల్లి రెవెన్యూ సర్వే నెం. 106లో 35 కుంటల భూమి ఉంది. ఈ విషయాన్ని కూడా రెవెన్యూ అధికారులే ధృవీకరించారు. దాదాపు 60 ఏళ్ల నుంచి ఈ భూమి మందడపు అచ్చయ్య స్వాధీనంలో ఉండగా వారసత్వంగా ఆయన కుమారులకు లభించింది. అచ్చయ్య నలుగురు కుమారులలో చిన్నవాడైన నారాయణ పేరున మిగిలిన ముగ్గురు ఆ భూమిని దఖలు పరిచారు. 2013 వరకు ఆ భూమి రైతు హక్కు భుక్తంలోనే ఉంది. ఇటీవల బ్రాహ్మణపల్లి గ్రామానికి విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరైంది. స్థల కేటాయింపు జరపాలని బోనకల్ తహసీల్దార్‌కు ఉత్తర్వులు రావడంతో ఆ పనిని గిర్దావర్‌కు అప్పగించారు. అన్ని గ్రామాల మాదిరిగానే ఎప్పటిలాగే పైరవీకారులు బయలుదేరి గిర్దావర్‌కు ఒక దెబ్బ రెండు పిట్టల కథ చెప్పారు. ఫలానా భూమిని కేటాయిస్తే మీకు మాకు మేలు జరుగుతుంది. పనికి పని లాభానికి లాభం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ హామీల దెబ్బకు మందడపు నారాయణ బలయ్యాడు.

### ఏదా రెండు పిట్టల కథ..

నారాయణ భూమి ప్రధాన రహదారికి అనుకుని ఉంది. దాని వెనక ఉన్న రైతులు వారి భూముల్లోకి పోవాలంటే నారాయణ భూమి నుంచే వెళ్లాలి. ఈ దారి విషయమై స్వల్ప వివాదం కూడా నడిచింది. ఇప్పుడు నారాయణ భూమిని సబ్ స్టేషన్‌కు ఇస్తే సబ్ స్టేషన్ భూమిలో నుంచి యధేచ్ఛగా దిగువ భూములకు వెళ్లవచ్చు. (సబ్ స్టేషన్ నిర్మాణం కూడా దారి వదిలే విధంగా డిజైన్ చేశారని ఆరోపణ) ఇటు భూ కేటాయింపు జరుగుతుంది, అటు రైతులకు మేలు చేసిన నేపంతో కొంద ఉపకారం పొందినట్లు అవుతుందని సబ్ స్టేషన్ స్థల కేటాయింపు పేరిట నారాయణ భూమిని అప్పగించేశారు.

### గ్రామసభ పంచనామ లేకుండానే...

ప్రజా ఉపయోగార్థం ఎటువంటి భూమినైనా, ఏ స్థితిలో ఉన్న ప్రభుత్వం స్వాధీనం చేసుకోవచ్చు. ఇందుకు భూ సేకరణ చట్టాలు కూడా ఉన్నాయి. కానీ పద్ధతి ప్రకారం స్వాధీనం చేసుకోవాలి. ముందుగా ప్రజా ఉపయోగార్థం చేపట్టబోయే పనిని వివరిస్తూ రైతుకు సమాచారం ఇవ్వాలి. అంగీకరించ పోతే గ్రామసభలు నిర్వహించి విషయాన్ని గ్రామస్తులకు తెలిపి ఆ తర్వాత పంచనామ ద్వారా భూమిని స్వాధీనం చేసుకోవాలి. కానీ గిర్దావర్ ఈ రెండు పనులు చేయలేదని సదరు రైతు నారాయణ వారి బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం గ్రామసభకు ఎవరు హాజరయ్యారు, మాకు ఏమైనా లిఖిత పూర్వక సమాచారం ఇచ్చారా, పంచనామ ఎక్కడ నిర్వహించారు, ఎవరు హాజరయ్యారో తెలియపర్చండి అని రైతు నారాయణ వారి కుటుంబ సభ్యులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా కనీసం స్పందించ లేదు. పైగా జరిగే పనులను అడ్డుకుంటే ఏమి జరుగుతుందో తెలుసా అంటూ భయపెట్టే ప్రయత్నం చేశారు.

### అంత ఇష్టానుసారమే...

తహసీల్దార్, గిర్దావర్ అంత ఇష్టానుసారంగా వ్యవహరించారు. 60 ఏళ్ల పాటు భూమిని అనుభవిస్తున్న రైతుకు కనీసం లిఖిత పూర్వక సమాచారం ఎందుకు ఇవ్వలేదంటే దానికి వారి వద్ద సమాధానం లేదు. రెవెన్యూ రికార్డుల ప్రకారం నాకు పహాణీ నకళ్లు ఇవ్వండి అని అడిగితే 2013 వరకు ఆ భూమి నారాయణ పేర ఉన్నట్లు ధృవీకరించారు. మరి నారాయణ పేరున ఉన్న భూమి ప్రభుత్వ భూమిగా ఎందుకు మారింది. సర్వే నెం. 106లో అసలు ఎంత భూమి ఉంది, ఆ సర్వే నెంబర్‌లో ఉన్న భూమి ప్రభుత్వ భూమి అయితే మిగతా భూమిని ఎందుకు ప్రభుత్వ భూమిగా చూపటం లేదు. కేవలం నారాయణ పేరున ఉన్న భూమి మాత్రమే ప్రభుత్వ భూమా అంటే సమాధానం లేదు. నారాయణకు ఉన్న ఏకైక ఆధారం ఆ భూమి మాత్రమే. అది మినహా ఎక్కడ సెంటు భూమి లేదు. చేతి వృత్తి ద్వారా కుటుంబాన్ని పోషించుకునే నారాయణకు ఉన్న ఆ కాస్త భూమిని గుంజేసుకున్నారు.

### పద్ధతి తప్పి వ్యవహరించిన అధికారులు...

భూ సేకరణ విషయంలో బోనకల్ రెవెన్యూ అధికారులు పద్ధతి తప్పి వ్యవహరించారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు తగు రీతిలో స్పందించాల్సి ఉంది. నారాయణ పేరున ఉన్న అసైన్డ్ భూమి ప్రభుత్వ భూమిగా ఎప్పుడు మారింది, ఎందుకు రైతుకు సమాచారం ఇవ్వలేదు, దీని వెనక ఉన్న గుట్టు ఏమిటి అన్న దానిని ఉన్నతాధికారులు తేల్చాల్సి ఉంది. మధిర నియోజక వర్గానికి ప్రాతినిథ్యం వహిస్తున్న భట్టివిక్రమార్క ఎన్నికలకు ముందు పాదయాత్రలో అసైన్డ్ భూములు ఎవరి చేతుల్లో ఉన్న స్వాధీనం చేసుకుని సంబంధిత పేదలకు అప్పగిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు పేదలకు అప్పగించమంటే రైతుకు ఉన్న ఒక్క ఆధారాన్ని ప్రభుత్వం లాగేసుకోవడమా అన్న దానిపై కూడా ఆలోచన చేయాలి. మొత్తంగా బోనకల్ రెవెన్యూ కార్యాలయం ఇప్పటికే ఆరోపణలకు కేంద్రంగా మారింది. పలు ఆరోపణలు ఇక్కడ అధికార యంత్రాంగంపై వెల్లువెత్తుతున్నాయి. తాజాగా కొందరికి మేలు చేసేందుకు ఓ రైతును బలి చేసిన భూ కేటాయింపు వెలుగు చూసింది. ఉన్నతాధికారులు మొత్తం కార్యాలయ పనితీరుపై సమగ్ర విచారణ జరపాల్సి ఉంది. ఇక్కడ కార్యాలయంలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు తమ కుటుంబ సభ్యుల తీర్థయాత్రల కోసం కొందరి నుండి డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలు కూడా వినవస్తుంది. బోనకల్ రెవెన్యూ కార్యాలయంపై విచారణ జరిపితే అనేక విషయాలు వెలుగు చూసే అవకాశం ఉండటంతో పాటు పేద రైతు నారాయణకు మేలు జరిగే అవకాశం ఉంది.

-ప్రజాపక్షం/ఖమ్మం


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

ఆదివారం | 22 | ఫిబ్రవరి | 2026 పేజీలు : 8


## ప్రైవేటు వసతి గృహాల్లో

# కరువవుతున్న క్రమశిక్షణ..!

**-కార్పొరేట్ హాస్టల్స్‌లో 'మత్తు' కలకలం**
**-ధనార్జనే ధ్యేయంగా వసతి గృహాల నిర్వహణ**
**-ఆందోళనలో తల్లిదండ్రులు**



ప్రజాపక్షం/ఖమ్మం : ప్రైవేటు వసతి గృహాల్లో క్రమశిక్షణ కరువవుతుంది. ధనార్జనే ధ్యేయంగా ప్రైవేటు విద్యా సంస్థల వసతి గృహాల నిర్వహణ ఉండడంతో కొందరు విద్యార్థులు హింసను భరించాల్సి వస్తుందన్న ఆవేదన తల్లిదండ్రుల్లో వ్యక్తమవుతుంది. మరికొన్నింటిలో మత్తు పదార్థాల వాడకం, ఘర్షణలు నిత్యకృత్యమవుతున్నాయి. కొన్ని వసతి గృహాల వ్యవహారం బహిర్గతమవుతుండగా మరికొన్ని లోలోపలే దాచిపెట్టే ప్రయత్నం జరుగుతుంది. ఇటీవల ఓ విద్యార్థిన్ని హాస్టల్‌లో చితకబాదిన ఘటన వెలుగు చూడటం

మిగతా 2లో..

# ఉదయ్ సేవలు చిరస్మరణీయం




**-ఆయన ఆశయం అజరామరం**
**-పువ్వాడ ఉదయ్‌కు ఘన నివాళి**

ప్రజాపక్షం/ఖమ్మం : పువ్వాడ ఉదయ్‌కుమార్ యువజన విద్యార్థి నాయకులుగా, ఖమ్మం మున్సిపల్ సిపిఐ మాజీ ఫ్లోర్ లీడర్‌గా అందించిన సేవలు చిరస్మరణీయమని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు పేర్కొన్నారు. ఉదయ్ కుమార్ ఒక కమ్యూనిస్టు మేధావి అని విదేశాల్లో విద్యను అభ్యసించిన ఆయన పేదల సమస్యల పరిష్కారానికి పోరాట మార్గాన్ని ఎంచుకున్నారన్నారు. దివంగత సిపిఐ నేత పువ్వాడ ఉదయ్‌కుమార్ 20వ వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక మమతలోని క్రాంతి ఘాట్‌లో ఉదయ్ స్మారక స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు

మిగతా 2లో..

# జిల్లాలో మళ్లీ పెద్దపులి టెన్షన్

**- అళ్లపల్లి అడవుల్లో సంచరిస్తున్న రెండు పులులు**
**- పులుల పాదముద్రలు లభ్యం**
**- అప్రమత్తంగా ఉండాలంటూ హెచ్చరిక**



2లో

# ప్రైవేటు వసతి గృహాల్లో కరువవుతున్న క్రమశిక్షణ

(మొదటి పేజీ తరువాయి)

తల్లిదండ్రులు ఆందోళన చేయటం విధితమే. రెండు రోజుల క్రితం నారాయణ కళాశాలకు చెందిన హాస్టల్‌లో మద్యం మత్తులో ఇద్దరు విద్యార్థులు మరో విద్యార్థిన్ని చితకబాదారని విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగాయి. ప్రైవేటు విద్యా సంస్థలు లాభాల దృష్టితోనే హాస్టళ్లను నిర్వహిస్తున్నాయి. హాస్టల్ భవనాల విస్తీర్ణం, అందులో ఉండే విద్యార్థులు మౌలిక వసతుల కల్పనకు సంబంధించి విద్యాశాఖాధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఇటీవల ఒక విద్యా సంస్థకు చెందిన వసతి గృహంలో లెక్కకు మించి విద్యార్థులు ఉండడంతో తెల్లవారుజామునే కొందరు లేచి స్నానం చేసి నిద్రకు ఉపక్రమించాలి, ఆ తర్వాత మరో బ్యాచ్ స్నానాలకు వెళ్లాలి. అలా అయితేనే విద్యా సంస్థల సమయానికి చేరుకునే అవకాశం ఉందట. దీనిని బట్టి వసతి గృహాల్లో మరుగుదొడ్ల సమస్య ఏవిధంగా ఉందో అవగతమవుతుంది. విద్యాశాఖాధికారులకు ఇవేమి పట్టే పరిస్థితి లేదు. విద్యా సంస్థలను కనీసం పరిశీలించకుండానే కార్యాలయాల్లోనే అనుమతులు మంజూరు చేస్తున్నారు. ఓ విద్యా సంస్థలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారు. వారికి తగిన రీతిలో బోధ నా సిబ్బంది ఉన్నారా ఉంటే వారికి ఉన్న అర్హతలు ఏమిటి, విద్యా సంస్థ వసతి గృహాన్ని నిర్వహిస్తుందా ఉంటే అందులో ఎందరు విద్యార్థులు ఉన్నారు, మౌలిక వసతులు ఉన్నాయా అనే విషయాలను పట్టించుకున్న నాధుడే లేడు. విద్యాశాఖాధికారులకు రావాల్సింది వస్తుంది ప్రైవేటు విద్యా సంస్థలకు ఇవ్వాల్సిన అనుమతులు ఇస్తున్నారు. అంతకు మినహా ఏ నిబంధన విద్యాశాఖాధికారులకు పట్టినట్లు లేదు. బహుళ అంతస్తుల్లో ప్రాథమిక పాఠశాలలను నిర్వహించడం చట్టరీత్యా నేరమే. అదేవిధంగా పాఠశాలలకు ఉండాల్సిన కనీస వసతులను ఏర్పాటు చేయాలి. ఇవేమి ఉమ్మడి ఖమ్మంజిల్లాలో నిర్వహిస్తున్న సగం పాఠశాలలకు లేవంటే అతిశయోక్తి కాదు. కొద్ది నెలల క్రిందట ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క విద్యాశాఖపై సమీక్ష సందర్భంగా విద్యాశాఖాధికారులను ప్రతి విద్యా సంస్థ నిబంధనల ప్రకారం ఉన్నదో లేదో పరిశీలించాలని లేని పక్షంలో అనుమతులు రద్దు చేయాలని ఆదేశించారు. ఈ ఆదేశాలను విన్నారు తప్ప విద్యాశాఖాధికారులు పాటించే ఆలోచన చేయడం లేదన్నది ప్రధాన ఆరోపణ. విద్యార్థుల తల్లిదండ్రులు విద్యా సంస్థలకే చెందిన వసతి గృహాల్లో ఉంటే ఎటువంటి ఇబ్బందులు ఉండవని మెరుగైన పద్దతుల్లో విద్యను అభ్యసించే అవకాశం ఉంటుందని భావించి ఆర్థికంగా భారమైన వసతి గృహాల్లో ఉంచేందుకు మొగ్గు చూపుతున్నారు. కానీ యాజమాన్యాలు మాత్రం ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తుండడంతో విద్యార్థులు కొన్ని వసతిగృహాల్లో నరకం అనుభవిస్తున్నారన్న ఆవేదన వ్యక్తమవుతుంది. తల్లిదండ్రుల ఆశలను నగదుగా మార్చుకుంటున్న వివిధ ప్రైవేటు విద్యా సంస్థల వసతి గృహాలపై పూర్తి స్థాయి పరిశీలన చేయా ల్సి ఉంది. నిబంధనలకు అనుగుణంగా లేని వసతి గృహ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాల్సి ఉంది. విద్యా బోధనతో పాటు యూనిఫాం, పుస్తకాల విక్రయం, హాస్టళ్ల నిర్వహణ ద్వారా అధిక ఆదాయం పొందెందుకు కొన్నియాజమాన్యాలు ప్రయత్నించడం ఈపరిస్థితికి కారణమవుతుంది.

# ఉదయ్ సేవలు చిరస్మరణీయం






(మొదటి పేజీ తరువాయి)



పువ్వాడ నాగేశ్వరరావు ఉదయ్ కుమార్ మాతృమూర్తి విజయలక్ష్మి, మమత ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి, ఉదయ్‌కుమార్ సతీమణి పువ్వాడ జయశ్రీ తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ పేద ప్రజల జీవితాల్లో మార్పు తీసుకు రావడానికి ఉదయ్‌కుమార్ తుదిశ్వాస వరకు కృషి చేశారన్నారు. ముఖ్యంగా పేదల నివాస స్థలాల కోసం ఆయన ఖమ్మంలో జరిపిన పోరాటం పలు పోరాటాలకు ఊపునిచ్చిందన్నారు. తదనంతర పరిణామాల్లో ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నప్పటికీ ఆయన వేలాది మందికి నివాస స్థలం దక్కేలా కృషి చేశారని ఆయన కృషిలో భాగంగానే ఇప్పుడు పువ్వాడ ఉదయ్ నగర్ ఏర్పాటైందని అక్కడి పేదలకు నివాస స్థలాలు దక్కాయని హేమంతరావు తెలిపారు. పువ్వాడ ఉదయ్‌కుమార్ ఆశయం అజరామరమని ఆయన ఆశయ సాధనకు కృషి చేయడమే మనం ఆయనకు ఇచ్చే సరైన నివాళి అన్నారు.

### వైఎస్ఆర్ నగర్‌లో...

వైఎస్ఆర్ నగర్‌లో పువ్వాడ ఉదయ్‌కుమార్ వర్థంతిని ఘనంగా నిర్వహించారు. ఖానాపురం హవేలీ శాఖ ఆధ్వర్యంలో ఉదయ్‌కుమార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు గాంధీ మాట్లాడుతూ ఉదయ్‌కుమార్ తన పోరాటాలతో ఎందరికో స్ఫూర్తిగా నిలిచారని ఆయన ఆశయ సాధనకు పునరంకితం కానున్నామన్నారు. పోరాటాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని ఆయన స్పష్టం చేశారు. రఘునాథపాలెం మండలం పువ్వాడ ఉదయ్ నగర్‌లో ఉదయ్‌కుమార్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వరరావు, మేకల శ్రీనివాసరావు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, సిపిఐ కార్యాలయ కార్యదర్శి కె. శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, సైదా, ఉపేందర్, ఆముదాల వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, యూసుఫ్ పాల్గొన్నారు.

# కలెక్టర్‌ను కలిసిన ఎంపి రఘురాంరెడ్డి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాం రెడ్డి కలిశారు. శనివారం కలెక్టరేట్‌కు వచ్చిన ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాంరెడ్డికి అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో ఖమ్మం ఎంపి రఘురాంరెడ్డి భేటీ అయ్యారు. ఎంపి నిధుల పనుల పురోగతిపై చర్చించారు. కొత్తగా చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలను తెలుసుకున్నారు. ఈజిఎస్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.

# అభివృద్ధి పనులకు మేయర్ శంకుస్థాపన



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలో అభివృద్ధి పనులకు మేయర్ పునుకొల్లు నీరజ శంకుస్థాపన చేశారు. శనివారం ఖమ్మం నగరంలోని 17వ డివిజన్ శ్రీనివాసనగర్‌లో రూ. 49 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్లు, డ్రైన్ నిర్మాణ పనులకు మేయర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువు లోగా పూర్తి చేయాలన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా రహదారులు, ఇతర మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ధనాల రాధ, నగేష్, నాయకులు ధనాల శ్రీకాంత్, శ్రీనివాసరావు, భుజంగరావు, పద్మ, వెంకన్న, కోటేశ్వరరావు, జహీర్‌రెడ్డి, డిఈ నరేందర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ పవన్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# చెత్త నిల్వకు స్థలం కేటాయింపు

### -రూ. 50 లక్షల నిధులు మంజూరు



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** వ్యర్థాల నిర్వహణ కోసం పువ్వాడ నగర్ గ్రామ పంచాయతీలో ప్రభుత్వం ఎకరం స్థలం కేటాయించడంతో పాటు షెడ్ల నిర్మాణానికి రూ. 50 లక్షలు నిధులు మంజూరు చేసింది. మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో సేకరించిన చెత్తను పువ్వాడ నగర్‌లో ఏర్పాటు చేసే డంపింగ్ షెడ్లకు తరలించనున్నారు. ఇక్కడకు తరలించిన చెత్తను నిల్వ చేయడంతో పాటు శుద్ధి చేసి అనంతరం సంబంధిత శుద్ధి కేంద్రాలకు పంపించేవిధంగా ప్రణాళికలు తయారు చేశారు. షెడ్ల నిర్మాణానికి సంబంధించి శనివారం కేటాయింపు స్థలంలో ముగ్గు పోశారు.

# జిల్లాలో మళ్లీ పెద్దపులి టెన్షన్

**ప్రజాపక్షం/కొత్తగూడెం :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అడవులు పులల సంచారానికి, ఆవాసానికి నిలయంగా మారాయి. తాజాగా రెండు పులులు ఆళ్లపల్లి మండల పరిధిలోని అటవీ గ్రామాల్లో సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు శనివారం అటవీ అధికారులు ఒక పులికి చెందిన పాదముద్రలు సేకరించగా, ఆ పాదముద్రలు సుమారు 16 సె.మీల వ్యాసార్థం కలిగి ఉన్నట్లు ధృవీకరించారు. ఇదిలా ఉండగా మరో పులి కూడా ఇక్కడే సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో తాజాగా ఆళ్లపల్లి అడవుల్లో రెండు పులులు తిరుగుతున్నట్లు తెలుస్తోంది. శనివారం ఉదయం ఆళ్లపల్లి మండల పరిధిలోని అనంతతోగు అటవీ ప్రాంతంలో పులులు సంచరించిన సమాచారాన్ని తెలుసుకున్న అటవీ అధికారులు ఆ ప్రాంతానికి చేరుకుని పాదముద్రలు సేకరించారు. ఇదిలా ఉండగా ఒక పులి అనంతతోగు వైపుకు వెళ్లినట్లు కాలిపాదముద్రల ద్వారా తేటతెల్లం కాగా, బంగారుచెలక, తోకబంధం గ్రామాల వైపు కూడా పాదముద్రలు ఉన్నాయి. అయితే అటవీ అధికారులు ఈ పులే అటు పైపు కూడా వెళ్లినట్లు చెబుతున్నప్పటికీ పాదముద్రలు వేర్వేరు పులలవి అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

**మొత్తం మూడు పులులు :**

జిల్లాలో మొత్తం మూడు పులులు సంచరిస్తున్నట్లు అటవీ అధికారులు గత నెల్లో ధృవీకరించారు. మణుగూరు, పినపాక అటవీప్రాంతాల్లో ఓ పులి సంచరిస్తున్నట్లు అటవీ అధికారులు గత మూడు నెలల క్రితం పూర్తి ఆధారాలతో నిర్ధారించారు. మహారాష్ట్ర అడవుల గుండా కామారెడ్డి మీదుగా ములుగు జిల్లా ద్వారా మరో పులి, భూపాలపల్లి వైపు నుండి ఇంకో పులి జిల్లా అడవుల్లో సంచరిస్తున్నట్లు పాదముద్రల ఆధారంగా అటవీ అధికారులు స్పష్టం చేస్తున్నారు. గత కొన్నేళ్ల క్రితం కూడా ఆళ్లపల్లి, గండాల సమీప అడవుల్లో పులి సంచరించి పశువులను సంహరించిన సంఘటనలో చోటు చేసుకున్నాయి. పొలాల్లో పనులు చేసే వారికి సైతం ఆ రోజుల్లో పులి కనిపించింది. కాగా తాజాగా ఆళ్లపల్లి అడవుల్లో పులి సంచారం ఉండటంతో అటవీ అధికారులు ఆయా గ్రామాల్లో హెచ్చరికలు జారీ చేశారు. పశువుల కాపరులు అడవుల్లోకి వెళ్లరాదని, ప్రజలు కొన్ని రోజుల పాటు పొలం పనులు మానుకోవాలని, గ్రామస్తులు ఒంటరిగా తిరగొద్దని చెబుతున్నారు. పుల జాగకోసం గాలిస్తున్నామని, దానికి గ్రామస్తులు ఎలాంటి హానీ తలపెట్టరాదని సూచించారు. ట్రాక్ కెమేరాలు ఉన్నాయని, ఏ క్షణమైనా పులి సంచారం కెమోరాల్లో చిక్కుతుందని అన్నారు.



**సరిగ్గా నెల క్రితం :**

గత నెల 21వ తేదిన అశ్వరావుపేట మండలం పరిధిలోని కావడగండ్ల అటవీ ప్రాంతంలో సంచరించిన పెద్దపుల్లి ఆ ప్రాంతంలోని పశువులను సంహరించి అహారంగా మార్చుకుంది. రెండు రోజుల తర్వాత అటవీ అధికారులు ఏర్పాటు చేసిన ట్రాక్ కెమేరాకు పెద్దపులి జాడ చిక్కింది. ఆంధ్రాలోని కొండమొదలు ప్రాంతం నుండి ఇటుగా ఆ పులి వచ్చినట్లు అధికారులు నిర్ధారించారు. జనవరి 19వ తేదిరాత్రి ఆ ప్రాంతంలో రెండు పశువులపై దాడి చేసి హతమార్చింది. ఆ తర్వాత తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన ఏపిలోని అడవుల్లోకి వెళ్లిపోయినట్లు అటవీ అధికారులు నిర్ధారించారు.

# పెన్షనర్ల బకాయిలను తక్షణమే చెల్లించాలి

**-23 నుంచి పెన్షనర్ల దీక్షలు**
**-ఎస్‌జిపిఏటి రాష్ట్ర నాయకురాలు మేరీ ఏసుపాదం**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** పెన్షనర్ల బకాయిలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని ఎస్‌జిపిఏటి రాష్ట్ర కార్యదర్శి మేరీ ఏసుపాదం డిమాండ్ చేశారు. శనివారం కృషి భవన్‌లో జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య అధ్యక్షతన జరిగిన ఎస్‌జిపిఏటి ముఖ్య కార్యకర్తల సమావేశంలో మేరీ ఏసుపాదం మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న వైఖరి కారణంగా ఉద్యమించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. నగదు రహిత వైద్యం అందించాలని, పెండింగ్ డిఏలు మంజూరు చేసి ఏక మొత్తంగా చెల్లించాలని, వెల్‌నెస్ సెంటర్లలో వసతులు కల్పించాలని, పిఆర్‌సిని సత్వరమే ప్రకటించాలని కోరారు. మార్కెట్ కమిటీలు, గ్రంథాలయ సంస్థలలో పనిచేసిన పెన్షనర్లకు ట్రెజరీ ద్వారా పెన్షన్ చెల్లించాలని వారు కోరారు. పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 23 నుంచి 26 వరకు ఖమ్మం కలెక్టరేట్ వద్ద ధర్నాచౌక్‌లో రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య తెలిపారు. ఈ రిలే నిరాహార దీక్షలకు పెన్షనర్లు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని




కోరారు. ఇటీవల కాలంలో మృతిచెందిన పెన్షనర్లు గౌస్, నారాయణ రావు, మైసయ్య, వెంకటరామయ్య, సరోజినిలకు సంఘం తరుపున నివాళులర్పించి మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్, ఉపాధ్యక్షులు పెదమాళ్ల సత్యనారాయణ, ఊడుగు వెంకటేశ్వర్లు, జల్లా వెంకటేశ్వర్లు, తాడి అంజలి, సీనియర్ పెన్షనర్లు దుగ్గినేని శ్రీనివాసరావు, కల్వకుంట్ల హన్మంతరావు, రాధాకృష్ణమూర్తి, ప్రసాదరావు, మధుకర్‌రెడ్డి, సుధాకర్, కంచుమర్తి పుల్లయ్య, హుస్సేన్, నాగరాజు, వెంకటరామనర్సయ్య, కృష్ణయ్య, చీదిరాల వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ముందస్తు పరీక్షలతోనే తలసేమియా నివారణ

**-ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ రెహనాబేగం**
**-సంకల్ప ఆధ్వర్యంలో తలసేమియా అవగాహన ర్యాలీ**





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ముందస్తు పరీక్షలు చేయించుకోవడం ద్వారానే తలసేమియాను నివారించడం సాధ్యమవుతుందని ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ రెహనాబేగం తెలిపారు. శనివారం సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో తలసేమియా వ్యాధిపై అవగాహన కల్పించేందుకు ఖమ్మంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పెవిలియన్ మైదానం నుంచి ప్రభుత్వ ఆసుపత్రి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రెహనాబేగం మాట్లాడుతూ తలసేమియా జన్యుపరంగా వచ్చే వ్యాధి అని ఇది క్యారియర్ స్టేజీలో ఉన్నప్పుడు తెలుసుకోవచ్చునన్నారు. పిల్లల్లో ఈ వ్యాధి సోకినప్పుడు తీవ్ర రక్తహీనత, జాండీస్ వంటి సమస్యలు తలెత్తుతాయన్నారు. తరచూ రక్తం ఎక్కించడం వల్ల వారి జీవితకాలం తగ్గే ప్రమాదం ఉందన్నారు. హెచ్‌బి ఎలక్ట్రోఫ్రోరసిస్ (హెచ్‌బిఎ2)పరీక్ష ద్వారా దీనిని గుర్తించవచ్చునన్నారు. ముఖ్యంగా గర్భిణీలు ముందస్తు పరీక్షలు చేయించుకోవడం ద్వారా తలసేమియా రహిత సమాజాన్ని నిర్మించవచ్చునన్నారు. ప్రముఖ వైద్యులు గొంగూర వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తలసేమియా బాధితులను జబ్బు పడిన వారిగా కాకుండా క్లినికల్లి ఛాలెంజ్డ్ వ్యక్తులుగా చూడాలన్నారు. ప్రస్తుతం ఉన్న ఏఐ, రోబోటిక్ టెక్నాలజీ, అడ్వాన్స్డ్ జీన్ ఎడిటింగ్ ద్వారా భవిష్యత్తులో ఈ వ్యాధిని పూర్తిగా నయం చేసే అవకాశం ఉందన్నారు. బాధితులను వెనక నుండి నడిపిస్తున్న తల్లిదండ్రులను సైలెంట్ హీరోస్ అని ఆయన అభివర్ణించారు. రక్తదానం చేయడం ద్వారా తలసేమియా పిల్లల భవిష్యత్తుకు అండగా నిలవాలని కోరారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పిడియాట్రిక్ కార్యదర్శి సాయిభార్గవ్ మాట్లాడుతూ తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు తరచుగా రక్తమార్పిడి అవసరం అన్నారు. యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని కోరారు. వివాహం చేసుకోబోయే వారు ముందస్తుగా పరీక్షలు చేయించుకుంటే ఈ వ్యాధిని అరికట్టవచ్చునన్నారు. ఈ సందర్భంగా తలసేమియా రహిత సమాజం కోసం ప్రతిజ్ఞ చేయించారు. సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు పి. అనిత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ నారాయణమూర్తి, డాక్టర్ లక్ష్మి దీప, డాక్టర్ నరేష్, ప్రముఖులు మమత, అనురాధ, సంస్థ ప్రతినిధులు పి. పావని, ఉదయ్‌భాస్కర్, రవిచందర్, వంశీకిరిటీ, రక్తదాతలు వంశీ, నవీన్, చిన్నారులు, తల్లిదండ్రులు, పులిపాటి నర్సింగ్ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ అభివృద్ధే మా ఎజెండా

**-ప్రజలు దళారులను నమ్మవద్దు**
**-ప్రజల మధ్యలోనే ఉంటాం :**
**మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్**



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీలో అవినీతి లేని పాలన అందించడమే మా ధ్యేయం అని వైరా మున్సిపాల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో ప్రతి పైసా అభివృద్ధి కోసమే ఉపయోగిస్తాం తప్ప ఇతర మార్గాలకు ఉపయోగించమని స్పష్టం చేశారు. ప్రతిరోజు మున్సిపాలిటీలో ఉన్న ప్రతి సమస్యను వార్డుల వారీగా తెలుసుకుంటామని పరిష్కరిస్తామని అన్నారు. మున్సిపాలిటీలో ఉన్న అతి ముఖ్యమైన సమ్య డంపింగ్‌యార్డ్, ఆ డంపింగ్ యార్డ్ సమస్యను త్వరలోనే ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ద్వారా మున్సిపాల్ చైర్‌పర్సన్ కాపా చంద్రకళ, వైస్ చైర్మన్ అయిన నేను కలిసి పరిష్కారం చేస్తామని, వాహనాలకు కూడా ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూస్తామని, వైరా బ్రిడ్జి వద్ద జరుగుతున్న డంపింగ్‌పై కూడా పూర్తిస్థాయిలో దృష్టి సారించడం జరిగిందని, త్వరలోనే ఆ సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. అదేవిధంగా త్రాగునీరు డ్రైనేజ్ నిర్మాణం పారిశుధ్యంపై నిత్యం పర్యవేక్షణ చేస్తాం, స్వచ్ఛమైన పాలనను ప్రజలకు అందిస్తాం, ప్రజా పాలనలో ప్రతి పైసా ప్రజల కోసమే ఖర్చు చేసేవిధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన అన్నారు. పన్నులు కట్టేటప్పుడు తప్పకుండా కంప్యూటర్ రసీదును తీసుకోవాలని ఆయన ప్రజలను కోరారు. అదేవిధంగా నేరుగా కూడా వచ్చి మున్సిపాలిటీ వద్ద పన్నులు కట్టవచ్చని ఆయన అన్నారు. ఎక్కడైనా ఎవరైనా పన్నుల కోసం పైసలు అడిగితే మాకు తెలియజేయండి. అలాంటి వారిపై చర్యలు తీసుకొని అధికారుల ఆదేశాలతో ప్రక్కన పెడతామని ఆయన అన్నారు. ప్రజా సమస్యల కోసం ప్రతిరోజు అందుబాటులో ఉంటానని వార్డు ప్రజలు సైతం నేరుగా మున్సిపాల్ చైర్‌పర్సన్‌ను నన్ను కలిసి సమస్యలను విరమించుకోవచ్చని కట్ల సంతోష్ తెలిపారు.

## తేజావత్ లాలు మృతికి సిపిఐ సంతాపం



**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల పరిదిలోని బోడియాతండా సిపిఐ సీనియర్ నాయకులు తేజావత్ లాలూ నాయక్ (80) శనివారం మృతిచెందారు. ఆయన మృతదేహాన్ని రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, జిల్లా నాయకులు పివి రావు, సిపిఐ తనికెళ్ల గ్రామశాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు, మండల నాయకులు పసుమర్తి శంకర్‌రావు, యాసా సత్యనారాయణ, కొత్తపల్లి సీతారాములు కలిసి సందర్శించి జోహార్లు అర్పించారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలియజేశారు. సందర్శించిన వారిలో సిపిఐ నాయకులు వడిత్యా రామదాసు, వీరన్న, రమేష్, తదితరులు పాల్గొన్నారు. మృతునికి డాక్టర్ రాంజీ, భీంజీ కుమారులు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు

## ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడిగా మనోజ్



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ముత్తగూడేనికి చెందిన ఏఐఎస్ఎఫ్ ఖమ్మంరూరల్ మండల కార్యదర్శి బూరా మనోజ్‌కుమార్ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడిగా ఎన్నికయ్యాడు. ఈ మేరకు నిజామాబాద్ పట్టణంలో 18,19,20 తేదీలలో జరిగిన ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర సమితి సభ్యుడిగా నియమితులయ్యాడు. ఈ సందర్భంగా మనోజ్ మాట్లాడుతూ... తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన రాష్ట్ర పార్టీకి, ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపాడు. యువత సమస్యల పరిష్కారినికి ప్రభుత్వంపై అలుపెరగని పోరాటాలు నిర్వహిస్తానన్నారు.

## అక్రమ నిర్మాణాలు కూల్చివేత



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధి వార్డు నెంబర్ 1లోని సర్వే నెంబర్101లో గల ప్రభుత్వ భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను రెవిన్యూ అధికారులు శనివారం కూల్చివేశారు. వీటిని పోలీసుల సహాయంతో ఆర్‌ఐలు ప్రసాద్, రవికాంత్ జేసీబీ ద్వారా తొలగింపు చేపించారు. అనంతరం ప్రభుత్వ భూమిగా బోర్డును ఏర్పాటు చేశారు. కాగా సంబధిత భూమి విలువ రూ.2కోట్ల వరకు ఉంటుందని, అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ హరి కృష్ణ, జీపీఓలు కోటేశ్వరరావు, వీరబాబు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## మజీద్‌కు ఇన్వర్టర్ బహుకరణ



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో గల మజీద్‌కు బిఆర్ఎస్ నాయకుడు మైబలిసాబ్ ఇన్వర్టర్‌ను శనివారం బహుకరించాడు. పవిత్ర రంజాన్ మాసాన్నిపురస్కరించుకొని, ముస్లింలకు పవిత్ర ప్రార్థనల సమయంలో విద్యుత్ సమస్య లేకుండా ఉండేందుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గెలిచిన ఓడిన ప్రజల పక్షానే ఉంటానని, అన్నారు. ఈ కార్యక్రమంలో మజీద్ సెక్రటరీ హుస్సేన్, సదర్ రఫీ, జాయింట్ సెక్రటరీ యూసుబ్, సభ్యులు సిరాజ్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## వెంకన్నస్వామిని దర్శించుకున్న చైర్‌పర్సన్



**ప్రజాపక్షం/ మధిర :** తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ సన్నిధికి మధిర మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత రామనాథం కాలినడకన చేరుకుని స్వామి వారిని దర్శించుకున్నారు. శనివారం ఇల్లెందులపాడు గ్రామం నుండి బయలుదేరి జమలాపురం వరకు చైర్‌పర్సన్ దంపతులు కాంగ్రెస్ శ్రేణులు కలిసి కాలినడకన జమలాపురం వెంకన్న స్వామిని దర్శించుకుని తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు చైర్‌పర్సన్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియన్ నాయకులు పాటిబండ్ల సత్యంబాబు, మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చావా వేణు, కర్నాటి రామారావు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రగతిరథ చక్ర అవార్డుల ప్రదానోత్సవం



**ప్రజాపక్షం/ మధిర :** మధిర డిపోలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగస్తులకు ప్రగతి రథ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం డిపో మేనేజర్ ఆర్.రామయ్య ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. డిపో పరిధిలో విధులు సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రయాణీకులకు మెరుగైన సేవలు అందించి తమ విధుల్లో ఎక్కువ ఆదాయం తెచ్చిన కండక్టర్లకు, ఎక్కువ ఆయిల్ ఆదా చేసిన డ్రైవర్లను గుర్తించి క్యాష్ అవార్డులతో సత్కరించారు. మధిర టౌన్ సిఐ రమేష్, రూరల్ సిఐ మధులు ముఖ్యఅతిధులుగా హాజరై మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి ప్రయాణీకులకు సమర్థవంతమైన సేవలందించిన డిపో డ్రైవర్లు, కండక్టర్లను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఎఫ్ రవీందర్, ట్రాఫిక్ సూపర్వైజర్ వెంకటేశ్వర్లు, సూసర్వైజర్లు, కార్యాలయ సిబ్బంది, విజిలెన్స్ సెక్యూరిటీ, గ్యారేజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి





**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ ఫిషరీస్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెలిశెట్టి నర్సింహారావు అధ్యక్షతన పాఠశాల విరామ సమయంలో ఏడో వార్డు కౌన్సిలర్ ఫణితి సైదులుని పాఠశాల తరపున ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ఫణితి సైదులు మాట్లాడుతూ సమస్యలను అదిగమించి పిల్లలు క్రమ శిక్షణతో చక్కగా చదువుకొని భావిభారత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ పాఠశాలతో నాకు చాలా అవినాభావ సంబంధం ఉందని, పాఠశాలలో మౌళిక వసతుల కల్పనకు, విద్యార్థుల పెరుగుదలకు నా వంతు కృషి చేస్తానని, ముఖ్యంగా ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు స్నేహపూర్వకంగా మా వార్డు ప్రజలందరితో ఉంటూ పాఠశాల అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఫణితి సైదులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెలిశెట్టి నర్సింహారావు, ఏఏపిసి చైర్మన్ ఆది రజిని, ఉపాధ్యాయులు, బీరెల్లి రామకృష్ణ, అంగన్‌వాడీ ఫాతిమా, కృష్ణవేణి, విద్యార్థుల తల్లిదండ్రులు లీలమ్మ, ఎండిఎం ఫాతిమా, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఫీల్డ్ వెరిఫికేషన్ యాప్‌తో 'మీసేవ'ల్లో సంస్కరణలు

**ప్రజాపక్షం/కొత్తగూడెం :** ఫీల్డ్ వెరిఫికేషన్ యాప్ ద్వారా మీ సేవా సేవల్లో మరింత వేగంగా, పారదర్శకంగా అందించేందుకు పలు సంస్కరణలు చేపడుతున్నట్లు జిల్లా ఇ డ్రిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వర్‌రావు అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం ఐడిఓసిలో ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ సేవా ఫీల్డ్ వెరిఫికేషన్ యాప్ ద్వారా క్షేత్రస్థాయిలో దరఖాస్తులు పరిశీలిన పూర్తి చేసి బయోట్యాగ్ ఫొటోలతో నేరుగా పోర్టల్లో అప్‌డేట్ చేయవచ్చని తెలిపారు. దీంతో నకిలి దరకాస్తులకు అడ్డుకట్టపడటంతో పాటు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పదకాల దరఖాస్తులు త్వరితగతిన పూర్తవుతాయని తెలిపారు. ఈ శిక్షణలో 200 మంది అదికారులు పాల్గొని యాప్ వినియోగంపై అవగాహన పొందారు. ఈ కార్యక్రమంలో ఐటి శాఖ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




## సంస్థ అభివృద్ధికి కృషి చేయాలి

**ప్రజాపక్షం/పాల్వంచ :** ఉద్యోగులు, కార్మికులు సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని కేటిపిఎస్ 5,6 దశల చీఫ్ ఇంజనీర్ మేక ప్రభాకర్‌రావు ఆకాంక్షించారు. తెలంగాణ ఎస్‌సి, ఎస్‌టి ఎలక్ట్రిసిటి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (621/14) డైరీ, వాల్ క్యాలెండర్‌లను శివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ సెక్రటరీ కూరపాటి రమేష్, రీజనల్ ప్రసిడెంట్ వరికూటి శ్రీనివాసరావు, లైసెన్ ఆఫీసర్ బండి నాగయ్య, ఎకౌంట్స్ అఫీసర్ జార్జి, రజనీ, ఏఈ రామ్మోహనరావు, తల్లా రవి, సింగిశెట్టి శ్రీను, బాలరాజు, కన్నయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో పుస్తకాలు వితరణ

**ప్రజాపక్షం/కొత్తగూడెం :** ఇండియన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫెలోషిప్ (ఎస్‌జిఎఫ్) ఆధ్వర్యంలో శనివారం గ్రంధాలయానికి పుస్తకాలు వితరణగా ఇచ్చారు. వివిధ పోటీపరీక్షలు, ఇతర విజ్ఞానాన్ని పెంపొందించే పుస్తకాలను ఎస్‌జిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు లోగాని శ్రీనివాస్, సభ్యుడు చిరపంగి శ్రీనివాసరావు చేతుల మీదుగా గ్రంధపాలకురాలు మణిమృదులకు అందించారు. అందించారు. గ్రంధాలయాభివృద్ధి పుస్తకాలు వితరణగా ఇచ్చిన వారికి చైర్మన్ పసుపులేటి వీరబాబు కృతజ్ఞతలు తెలిపారు.



## ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

**ప్రజాపక్షం/అశ్వాపురం:** మండల పరిధిలోని మొండికుంటలో యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. ఈవిషయంపై వివరాలు ఇలా ఉన్నాయి. మొండికుంట గ్రామానికి చెందిన సున్నం జయంత్(22) ట్రాక్టర్ డైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఉరి వేసుకొని మృతి చెందారు. ఈవిషయం తెలుసుకున్న స్థానిక సిఐ అశోక్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని మృతికి గల కారణాలు తెలుసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కమిటీలో భద్రాద్రి జిల్లాకు సముచితస్థానం



**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్రకమిటీలో భద్రాద్రి జిల్లాకు సముచిత స్థానం దక్కింది. రాష్ట్ర సమితి సభ్యులుగా జిల్లాకు చెందిన వరక అజిత్, ఎస్‌కె షాహీద్, గండాల సుజన్, ఇనంపల్లి సాయి, మాణిక్యాల వినయ్, గగులోతు వంశీ ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) రాష్ట్ర నాల్గవ మహాసభలు నిజాంబాద్ జిల్లా వేదికగా జరిగాయి. ఈ మహాసభల వేదికగా ఈ ఎన్నిక చోటు చేసుకుంది. నూతనంగా విద్యారంగంలో వస్తున్న మార్పులపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఈ మహాసభ పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా రాష్ట్రకమిటీకి ఎన్నికైన విద్యార్థి సంఘ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వానికి విద్యారంగం పట్ల సరైన విధానం లేదని, ప్రభుత్వ విద్యారంగ బలోపేతం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోనేలా పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని చెప్పారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని నింపడం కోసం కృషి చేస్తామని, మతోన్మాద భావాజాలాన్ని విద్యాసంస్థల్లో అరికట్టేందుకు పోరాటాలు నిర్వహిస్తామని చెప్పారు. భద్రాద్రి జిల్లా అంటేనే కమ్యూనిస్టులకు కంచుకోటని, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో, జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా సూచనలు, సలహాల మేరకు విద్యారంగ సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలు నిర్వహిస్తామన్నారు.

## మత్స్య కార్మికుల సమస్యను పరిష్కరించండి

**ప్రజాపక్షం/వైరా:** వైరా చెరువులో చేపల వేటపై ఆధారపడి జీవించే మత్స్య కార్మికులపై ప్రభుత్వ అధికారులు చేపల వేంట నిషేధం చేయాలని ఒత్తిడి చేయడంతో వైరా ప్రాజెక్ట్ మత్స్యకారులు శనివారం బొర్రా రాజశేఖర్‌ని కలిసి చేపట వేట నిషేధంపై మత్స్యశాఖ జిల్లా ఏడితో మాట్లాడాలని కోరారు. బొర్రా రాజశేఖర్ ఖమ్మం జిల్లా ఏడితో ఫోన్‌లో మాట్లాడుతూ సుమారు 1000 కుటుంబాలు చెరువుపై చేపల వేట చేస్తూ జీవనం సాగిస్తున్నాయి. మీరు అర్ధాంతరంగా చేపలు వేట నిషేధం చేస్తే వారి కుటుంబాలు రోడ్డున పడతాయి. మీరు ఏదైనా చేపల వేట నిషేధం చేయదలిస్తే జూన్, జులై రెండు నెలల్లో మాత్రమే నిషేధించండి, ఎందుకంటే ఆ రెండు నెలల్లోనే చేప పిల్లల ఉత్పత్తి జరిగింది. కాబట్టి ఆ రెండు నెలల్లో నిషేధం చేస్తే బాగుంటుంది. ఇప్పుడు వేట కొనసాగించకపోతే వారి జీవనోపాధికి ఇబ్బంది కలిగి వారి కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉంది. ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఉంది. కాబట్టి వేట కొనసాగించాలని అన్నారు. స్పందించిన మత్స్య శాఖ అదికారి చేపల వేట కొనసాగించుకోవచ్చని స్పష్టమైన హామీ ఇచ్చారు. చేపల సొసైటీ ద్వారా చెల్లించాల్సిన శిస్తు డబ్బులు త్వరగా చెల్లించాలని కోరడం జరిగింది. దానికి బొర్రా రాజశేఖర్ స్పందిస్తూ ఆ యొక్క శిస్తు డబ్బులు కమిటీ ద్వారా కట్టించే బాధ్యత తీసుకుంటానని వారికి హామీ ఇవ్వడం జరిగింది. చేపల వేట కొనసాగించడానికి మత్స్యశాఖ అధికారి స్పష్టమైన హామీ ఇవ్వడంతో మత్స్యకారుల్లో ఆనందోత్సవాలు వెల్లువిరిసాయి. ఈ కార్యక్రమంలో ఏడో వార్డు కౌన్సిలర్ ఫణితి సైదులు, తిరుమలరావు, నాగుమీరా, ఖాదర్, గౌసుద్దీన్, అక్బర్, రమేష్, రాజావలి, మదార్, హుసేన్, ఇమామ్, సైదులు, ఉపేందర్, కృష్ణ, సైజాని, మురళి, మల్లారం జాని సైదులు, రెహమతుల్లా, ఇమామ్, దేవళ్ళ కృష్ణ, ఉప్పు రామకృష్ణ, పెద్ద సైజాని, ఎలెపి అక్బర్ తదితర మత్స్య కార్మికులు పాల్గొన్నారు.



## తాళ్లగొమ్మూరులో 15 వేల మొక్కలను నాటారు..


**ప్రజాపక్షం/బూర్గంపాడు:** మండల పరిధిలోని తాళ్లగొమ్మూరు గ్రామంలో పర్యావరణ పరిరక్షణకై మొక్కల పెంపకాన్ని ప్రోత్సహిస్తూ రోటరీ క్లబ్ అఫ్ ఇన్ భద్ర సారపాక వారి ఆధ్వర్యంలో 15వేల మొక్కలను విజయవంతంగా నాటారు. ఈకార్యక్రమానికి విశిష్ట అతిథిగా రోటరి డిస్ట్రిక్ట్ గవర్నర్ శ్రీరామ్ ప్రసాద్ హాజరై, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈకార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి మేలు చేసే ఇటువంటి కార్యక్రమం చేయడం చాలా మంచి విషమని, ఇవి మనకు స్వచ్ఛమైన గాలిని అందించడంతో పాటు, జీవరాశికి మేలు చేస్తాయన్నారు. దీని కోసం అందరూ చాలా ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రోటేరియన్ శైలేంద్ర సింగ్ మాట్లాడుతూ కాలుష్య నియంత్రణలో మొక్కలది ప్రథమ స్థానమని అన్నారు. ఇవి వాతావరణాన్ని సమతుల్యం చేస్తాయని, కాబట్టి అందరూ ఎక్కువ సంఖ్యలో మొక్కలు నాటి తమ వంతు బాధ్యతగా వాటిని సంరక్షించాలన్నారు. ఈకార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు రేటేరియన్ రాంబాబు, కార్యదర్శి రోటేరియన్ చాందర్ బాషా, రోటేరియన్ శ్యామ్ కిరణ్, రోటేరియన్ భాస్కర్, రోటేరియన్ ప్రఫుల్ల కుమార్,



రోటేరియన్ చంగల్‌రావు, రోటేరియన్ బసప్ప రమేష్, రోటేరియన్ రాజశేఖర్, రోటేరియన్ సత్యనారాయణ, రోటేరియన్ మురళీధర్, రోటేరియన్ తిరుపతిరావు, రోటేరియన్ మహేష్, రోటరాక్టర్స్ విద్యావాణి, మల్లికార్జున్, సౌమ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

**ప్రజాపక్షం/పాల్వంచ :** మండల పరిధి లక్ష్మిదేవిపల్లిలోని పాల్వంచ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో తెలుగు, హిందీ, ఇంగ్లీష్ విభాగాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పోలారపు పద్మ మాట్లాడుతూ మాతృభాష మన సంస్కృతికి, సాంప్రదాయాలకు ప్రతిరూపమన్నారు. కావునా ప్రతీ ఒక్కరు తమ మాతృభాషను గౌరవించుకొంటూ పరిరక్షించుకోవాలని సూచించారు. హిందీ, తెలుగు, ఇంగ్లీష్ విభాగాధిపతులు టి. అరుణ కుమారి, శెట్టి స్వరూపరాణి, లీలాసౌమ్యలు మాట్లాడుతూ మాతృభాష మన తొలి గురువు అన్నారు. భాష ద్వారా మన సంస్కృతి తరతరాలకు చేరుతుందన్నారు.తెలుగు భాషా సాహిత్య సంపద అపారమని, విద్యార్థులు తమ భాషపై గర్వంగా ఉండాలని చెప్పారు. మృతృభాష బలమైన పునాది కాగా ఇతర భాషలు ప్రపంచంతో అనుసంధానమయ్యే వేదికలని తెలిపారు. అనంతరం కళాశాలలో బి.కామ్ చదువుతున్న విద్యార్థి లేఖ స్పానిష్ భాషలో మాట్లాడి అందరిని ఆకట్టుకొంది. మరో విద్యార్థి జ్యోతి ఇంగ్లీష్‌లో నీతి కథలను వినిపించారు.పలువురు విద్యార్థులు తమ మాతృభాషలైన కోయ, లంబాడ భాషలలో మాట్లాడి వైవిద్యాన్ని చాటిచెప్పారు. విద్యార్థుల కవితా పఠనం, ప్రసంగాలతో ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగింది. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జే. మాధవి, కొండలరావు, డి. రమేష్, విజయప్రసాద్, వేముల కామేశ్వరరావు, పొట్లపువ్వు శ్రీనివాసరావు, పారెల్లి శ్రీనివాస్, కోటగిరి రాంబాబు, ఎన్. శ్రీదేవి, కరీమా, విమల, ఈ.శ్రీను, భాను, ప్రవీణ్, బాబ్జిఖాన్, తేజస్విని, హారిక, రాజ్‌కుమార్, విద్యార్థులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# గురుకుల ప్రవేశ పరీక్షకు సర్వం సిద్ధం..!

**68 కేంద్రాలు..25,140 మంది విద్యార్థులు**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఖమ్మం జోన్ పరిధిలో గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించున్నారు. ఇందుకు సంబంధించి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. 2026 27 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి లో ప్రవేశం కోసం ఈ నెల 22 న నిర్వహించనున్న పరీక్ష కోసం మొత్తం 68 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 25,140 మంది విద్యార్థులు పరీక్ష కు హాజరు కానున్నారు. జోన్ పరిధిలో ఖమ్మం,భద్రాధి కొత్తగూడెం జిల్లాలకు సంబంధించిన గురుకులాలలో ఆరో తరగతి లో ప్రవేశాలకు పరీక్ష నిర్వహించనున్నారు. ఖమ్మం జిల్లా లో 17, భద్రాధి కొత్తగూడెం జిల్లాలో 18 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష లను విజయంతంగా నిర్వహించేందుకు చీఫ్ సూపరిండెంట్‌లు, డిపార్ట్‌మెంట్ , రూట్ అధికారులను నియమించారు. పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్ టిక్కెట్లు ఇప్పటికే డౌన్ లోడ్ చేసుకుని ఉంచుకోవాలని ,ఒకవేళ చేసుకుని వారు అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇందుకు విద్యార్థి ఐడీ, పుట్టిన తేది వివరాలు అవసరం, గంట ముందు పరీక్షాకేంద్రాలకు ఉండేలా జాగ్రత్త పడాలి.

**పరీక్షా విధానం....**

ఓయంఆర్ విధానంలో పరీక్ష ఉంటుంది. వంద మార్కులుకు బహుళైచ్ఛిక సమాధానాలతో ప్రశ్నపత్రం అందజేస్తారు. ఒక్కో ప్రశ్నకు జవాబు, ఓయంఆర్ షీట్ లో నమోదు చేయాలి. తెలుగు కు 20, ఇంగ్లీషు కు 25, గణితం 25 , పరిసరాల విజ్ఞానం 20, మెంటల్ ఎబిలిటీల నుంచి 10 ప్రశ్నలు ఇస్తారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహిస్తారు.




**ఏటేటా పెరుగుతున్న గురుకులాల పై ఆసక్తి...**

జిల్లాలో ప్రతీ ఏటా గురుకులాల పై విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. ఆరో తరగతి నుంచి 9 తరగతి వరకు ఖాళీలు ఉంటే భర్తీ చేస్తారు. ఈ భర్తీ సమయంలో ప్రవేశ పరీక్ష కు వందలాది మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటున్నారు. గురుకులాలలో క్రమశిక్షణ, నాణ్యమైన విద్య, భోజనం, ఇతరత్రా సదుపాయాల వలన ముఖ్యంగా పిల్లలకు మంచి భవిష్యత్ ఉంటుంది...భద్రత కల్పిస్తున్నారు. దీంతో విద్యార్థులు మరియు తల్లిదండ్రులు గురుకులాల పై ఆసక్తి పెంచుకుంటున్నారు. గురుకులాలలో సీటు సాధించేందుకు అవసరమైన కోచింగ్ ను ఇప్పిస్తున్నారు. దీంతో గురుకులాల సీట్లు కు మంచి డిమాండ్ ఉంది.

**ఏర్పాట్లు పూర్తి : కె.అలివేలు, జోనల్ అధికారి, గురుకులాల సంస్థ, ఖమ్మం.**



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టీజీసెట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. మొత్తం 68 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశాం. రాష్ట్ర ఉన్నతాధికారుల పర్యవేక్షణలో పరీక్ష నిర్వహిస్తాం, విద్యార్థులు ఉదయం 10.30 గంటలకే పరీక్ష కేంద్రం కు చేరుకోవాలి. ఉదయం 11 గంటలు దాటితే లోపలికి అనుమతి ఉండదు. అందుకే విద్యార్థులు ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలి. హాల్ టిక్కెట్లు డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించారు.

# నాడు విద్యార్థిని.. నేడు అతిథి..!

**-ఏఈసీఎస్ మణుగూరుకు కొర్లకుంట భావన గర్వకారణం**




**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండలానికి చెందిన కొర్లకుంట రాంబాబు అనే మెడికల్ షాప్ చిరు వ్యాపారి కుమార్తె కొర్లకుంట భావన తన కృషి, పట్టుదలతో గొప్ప విజయాన్ని సాధించి స్వగ్రామానికి గర్వకారణంగా నిలిచింది. అశ్వాపురంలోని భారజల కర్మాగారం గౌతమీనగర్‌లోని అటామిక్ ఎనర్జీ సెంటర్ స్కూల్ మణుగూరు పాఠశాలలో 2006 సంవత్సరంలో 1వ తరగతిలో ప్రవేశం పొందిన భావన, 2016లో 10వ తరగతి పూర్తి చేసింది. అదే పాఠశాలలో విద్యను ఆరంభించిన ఆమె, నేడు ఎంబీబీఎస్ పట్టా పొందిన వైద్యురాలిగా అదే పాఠశాలకు అతిథిగా హాజరవడం విశేషంగా నిలిచింది. పాఠశాల విద్యార్థినిగా తన ప్రయాణాన్ని ప్రారంభించిన భావన, నిరంతర శ్రమతో ఎంబీబీఎస్ పూర్తి చేసి వైద్య వృత్తిలో కొనసాగుతోంది. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది ఆమెకు ఘన స్వాగతం పలికి సత్కరించారు. విద్యార్థిగా చేరి, వైద్యురాలిగా తిరిగి రావడం అరుదైన గౌరవం అని ఉపాధ్యాయులు అభినందించారు. భావన సాధించిన ఈ విజయం అశ్వాపురం మండల ప్రజలకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది. సాధారణ కుటుంబం నుండి వచ్చిన ఆమె పట్టుదలతో ఉన్నత శిఖరాలను అధిరోహించడం అనేక మందికి ప్రేరణగా మారింది. తన కుమార్తె సాధించిన ఈ ఘనత తల్లిదండ్రులకు ఎనలేని గౌరవాన్ని తీసుకువచ్చింది. ఒకప్పుడు విద్యార్థిగా కూర్చున్న తరగతి గదుల్లోనే నేడు అతిథిగా నిలబడిన భావన ప్రయాణం, ఆ పాఠశాలకే కాదు మొత్తం ప్రాంతానికే గర్వకారణమని మండల ప్రజలు కొనియాడుతున్నారు.

## అశ్వాపురం గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల సమావేశం

**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం గ్రామ పంచాయితీ కార్యాలయంలో శనివారం ఉప సర్పంచ్ తుళ్లూరు ప్రకాష్ అధ్యక్షతన వార్డు సభ్యుల సమావేశం నిర్వహించారు. గ్రామ అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ సమావేశం కొనసాగింది. ఈ సమావేశంలో ప్రధానంగా త్రాగునీటి సరఫరా, పారిశుద్ధ కార్యక్రమాలు, వీధి దీపాల నిర్వహణ వంటి అంశాలపై సమగ్ర చర్చ జరిగింది. ముఖ్యంగా రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని త్రాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సభ్యులు సూచించారు. గ్రామంలోని పైప్ లైన్ల మరమ్మతులు, లీకేజీల నివారణ, నీటి ట్యాంకుల శుభ్రత వంటి అంశాలపై తక్షణ చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. అదే విధంగా పారిశుద్ధ కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించి గ్రామాన్ని శుభ్రంగా ఉంచాలని, చెత్త సేకరణ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. వీధి దీపాలు సక్రమంగా వెలిగేలా పర్యవేక్షణ చేయాలని, పని చేయని దీపాలను వెంటనే మార్చాలని అధికారులు నిర్ణయించారు. ఈకార్యక్రమంలో గ్రామ పంచాయితీ కార్యదర్శి దాసరి మల్లేశం, వార్డు సభ్యులు, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు. గ్రామాభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని ఉపసర్పంచ్ తుళ్లూరు ప్రకాష్ పిలుపునిచ్చారు.



## గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి:కలెక్టర్

**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** జిల్లాలోని గ్రామాలను సమగ్ర ప్రణాళికతో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. శనివారం డా.మన్మోహన్ సింగ్ ఎర్త్ యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహించిన నూతన సర్పంచ్‌లు రెండో విడత శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశంలో ఆయన పాల్గొన్నారు. జిల్లాలోని అశ్వారావుపేట, దమ్మపేట, దుమ్ముగూడెం, ములకపల్లి, జూలూరుపాడు, ్ధలూరుపాడు, ఇల్లెందు, లక్ష్మీదేవిపల్లి మండలాలకు చెందిన 233 మంది సర్పంచ్‌లు ఐదురోజుల పాటు ఈ శిక్షణ తీసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయితీ రాజ్ చట్టం పై వగాహనతో పాటు గ్రామాభివృద్ధి ప్రణాళికలు, బడ్జెట్ నిర్వహణ, పారదర్శకత వంటి అంశాలపై మార్గదర్శనం అందించినట్లు చెప్పారు. గ్రామాల్లో తాగునీరు, రహదారులు, విద్యుత్, పారిశుధ్యం వంటి ప్రాథమిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ శిక్షణ పూర్తి చేసుకున్న సర్పంచ్‌లకు ధృవీకరణ పత్రాలు అందించిన ఆనంతరం నూతన సర్పంచ్‌లు కలెక్టర్‌ను సత్కరించి సన్మానించారు.



## అశ్వాపురంలో అక్రమ పశువుల రవాణా

**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం బస్టాండ్ సెంటర్ వద్ద శనివారం తెల్లవారు జామున పోలీసులు అక్రమంగా తరలిస్తున్న పశువులను స్వాధీనం చేసుకున్నారు. మణుగూరు నుండి మోరంపల్లిబంజర్ వైపు వెళ్తున్న వాహనంలో బందించి తీసుకెళ్తున్న 12 పశువులను పోలీసులు అడ్డుకుని పట్టుకున్నారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వాహనాన్ని తనిఖీ చేయగా పశువులను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు అశ్వాపురం సిఐ అశోక్‌రెడ్డి తెలిపారు. స్వాధీనం చేసుకున్న పశువులను సంరక్షణార్థం పాల్వంచ గోశాలకు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. అక్రమ పశువుల రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## సర్పంచ్ ఉమా నరేష్‌కు సన్మానం

**ప్రజాపక్షం/కారేపల్లి:** రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రధాన అనుచరులు మాదారం సర్పంచ్‌గా రెండవ సారి సర్పంచ్‌గా ఎన్నికైన సందర్భంగా అజ్మీరా ఉమా నరేష్‌ను కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరుపతిరావు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఇమ్మడి మాట్లాడుతూ అజ్మీరా నరేష్ గత పది సంవత్సరాల నుండి పొంగులేటి నాయకత్వంలో ప్రజల కష్ట సుఖాలు పాలు పంచుకుంటు ఎన్నో సేవ కార్యక్రమాలు చేశారని అన్నారు. మాదారం గ్రామ అభివృద్ధిలో సర్పంచ్ ఉమా నరేష్‌కు మంత్రి పొంగులేటి సహాయ సహకారాలు ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో మల్లెల నాగేశ్వరరావు, బైల్ కంపెనీ డిజియం గుగులోతు రవి నాయక గిరిజన సంఘం నాయకులు అజ్మీరా శివ నాయక్, కాంగ్రెస్ నాయకులు తోగర శ్రీను, పాల్గొన్నారు.



## పాఠశాలలో పీటీఎం సమావేశం

**ప్రజాపక్షం/కారేపల్లి:** ఎంపీపీఎస్ బొక్కల తండా పాఠశాలలో పీటీఎం సమావేశం నిర్వహించారు. అనంతరం శ్రీ సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈసమావేశంలో పీహెచ్‌సీ సింగరేణి నుండి మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ వి మహేశ్వరి విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. అనంతరం 5వ తరగతి విద్యార్థులకు గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష హాల్ టికెట్లు అందజేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి విజయలక్ష్మి, ఉపాధ్యాయులు వి మంగీలాల ఏఏపీసీ చైర్మన్, పిహెచ్‌సి సింగరేణి వైద్య సిబ్బంది, అంగన్వాడి ఉపాధ్యాయురాలు రజిని కుమారి, విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ చైతన్యలో ఇన్నోవేషన్ ప్రారంభం

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఇన్నోవేషన్ అండ్ ఇన్క్యూబేషన్ సెంటర్‌ను శనివారం ప్రారంభించారు. అలాగే రెండురోజుల పాటు జరిగిన హ్యాకథాన్‌ను ఘనంగా ముగించారు. ఇందులో ముఖ్య అతిథిగా చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ పాల్గొన్ని విద్యార్థులకు దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ వి. సుదర్శన్, టిపిఓ డాక్టర్ రాజేష్, అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ వైశాలి, డిప్లోమా ఇన్చార్జ్ కృష్ణప్రసాద్, జ్యోతి, చార్యులు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# నిరంతర సాధనతోనే అత్యున్నత స్థానం




ప్రజాపక్షం/తల్లాడ : నిరంతర సాధనతోనే విద్యార్థులు అత్యున్నత స్థానాలకు చేరుకుంటారని టియుడబ్ల్యుజె (ఐజెయు) జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరరావు తెలిపారు. విద్య జీవన గతిని మార్చివేస్తుందని ఆయన అన్నారు. శనివారం యూనివర్సల్ విద్యాలయంలో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం స్థానిక యూనివర్సల్ విద్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గురు బోధనలను అవగతం చేసుకుని అత్యున్నత రీతిలో సమాధానాలు రాసేందుకు ప్రయత్నించాలన్నారు. ప్రతి విద్యార్థికి ఒక లక్ష్యం ఉండాలని ఆ లక్ష్యం దిశగా కృషి జరగాలని ఆయన సూచించారు. పదవ తరగతి జీవితంలో ఓ మలుపుకు కారణమవుతుందని ఇక్కడ ఎక్కువ మార్కులు సాధిస్తే భవిష్యత్తులో ఉన్నత విద్యకు మార్గం సుగమమవుతుందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, యాజమాన్యాల మధ్య అవ్యాయత అవసరమని అది యూనివర్సల్ విద్యాలయంలో ఉండటం అభినందనీయమన్నారు.

**- రీయంబర్స్‌మెంట్ విద్యా సంస్థలకే ఆదర్శం**
**-ఘనంగా పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం**



**రీయంబర్స్‌మెంట్ విద్యా సంస్థలకే ఆదర్శం..**

యూనివర్సల్ విద్యాలయం ప్రవేశపెట్టిన ఫీజు రీయంబర్స్‌మెంట్ ప్రస్తుత విద్యా సంస్థలకే ఆదర్శంగా నిలవనుంది. ఒకటి నుండి పది తరగతుల వరకు ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను ప్రకటించారు. ఫీజులో 50 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు విద్యార్థుల హర్షధ్వనుల మధ్య పాఠశాల కరస్పాండెంట్ టికె ప్రసన్నన్, డైరెక్టర్ మేరీ సోఫియా ప్రకటించారు. ఈ ఏడాది ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు మొదటి ర్యాంకులు సాధించిన వారికి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ టికె ప్రసన్నన్, డైరెక్టర్ మేరీ సోఫియా, సిబ్బంది యాకూబ్, మోహన్, రవి, రాము, రమేష్, మనీషా, అరుణ, సమత, ఝాన్సీ, రమ్య, లావణ్య, జర్నలిస్టు కృష్ణార్జున్, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

# నూతన పాలకవర్గానికి సమస్యల సవాళ్లు..!




ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీలో బాధ్యతలు చేపట్టిన నూతన పాలక సభ్యులకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. వైరా మున్సిపాలిటీల్లో పలు సమస్యలు పేరుకుపోయాయి. ప్రధానంగా అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, పలు వార్డుల్లో త్రాగునీటి సమస్య.

**తాగునీటికి తప్పని తిప్పలు...**

మున్సిపాలిటీల్లో ప్రజలను త్రాగునీటి సమస్య పలు వార్డుల్లో వేధిస్తుంది. మిషన్ భగీరథ పథకం క్రింద రక్షిత మంచినీరు సరఫరా చేస్తున్నామని చెప్పుకుంటున్న సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో నీటి సరఫరాపై దృష్టి సారించడం లేదు. ఫలితంగా రోజు విడిచి రోజు, మూడు రోజులకొకసారి ప్రజలకు త్రాగునీరు అందుతుంది. దీంతో ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. మంచినీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో ప్రైవేటు మినరల్ వాటర్ ప్లాంట్‌లలో కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. నీళ్ల ట్యాంకుల్లో బ్లీచింగ్ పౌడర్‌తో శుద్ధి చేసిన దాఖలాలు కూడా లేవు. వర్షాకాలంలో త్రాగునీరు కలుషితం అయ్యే అవకాశాలు ఉండగా, ప్రజలు అనారోగ్యాల బారిన పడే అవకాశం ఉంటుంది. అయినప్పటికీ నీళ్ల ట్యాంకుల్లో బ్లీచింగ్ కూడా చేయలేదనే ఆరోపణలు అనేకం ఉన్నాయి.

**విలీన గ్రామాల్లో సమస్యలే సమస్యలు...**

విలీన గ్రామాల్లో కొంతకాలంగా సమస్యలు తిష్ట వేశాయి. దిద్దుపూడి, పల్లిపాడు, లాలాపురం, బిసి కాలనీ విలీనం చేసిన గ్రామాల్లో ఇప్పటికీ సరియైన వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ పథకంలో భాగంగా ఇంటింటా నల్లాలు ఏర్పాటు చేసినప్పటికీ పూర్తిస్థాయిలో నీరు సరఫరా కావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అంతర్గత రోడ్లు సైతం పూర్తి అధ్వాన్నంగా ఉన్నాయని ప్రజలు చెబుతున్నారు.

**ఏళ్లు గడిచినా పరిష్కారం గాని డంపింగ్ సమస్య...**

వైరా మున్సిపాలిటీలో ప్రజలను వేధిస్తున్న ముఖ్యమైన సమస్య డంపింగ్‌యార్డ్ సమస్య. ఈ డంపింగ్ యార్డ్ సమస్య నేటికి పరిష్కారం కాలేదు. గతంలో తల్లాడ మండలం రెడ్డిగూడెం రెవెన్యూలో స్థలం కేటాయించారు. దానికి నిధులు కూడా కేటాయించారు. కేవలం నిధులు వృధా అయ్యాయి తప్ప సమస్య పరిష్కారం కాలేదు. ఎందుకు అంటే వైరా నది నుండి ఆ ప్రాంతానికి వాహనాలు పోవడానికి సరైన మార్గం లేదు. వాహనాలు పోవడానికి తీవ్ర ఇబ్బందులు డ్రైవర్లు పడాల్సిన పరిస్థితి ఉంది. మరోవక్క పినపాక నుండి పోవాలన్న పరిస్థితి అనుకూలంగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇక్కడ ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్‌కు లక్షల రూపాయల నిధులు కేటాయించి దుర్వినియోగం చేశారని వాదన కూడా బలంగా ప్రజల్లో వినిపించింది. అనంతరం ఎక్కడ వసతి లేకపోవడంతో వైరా నది పినపాక బ్రిడ్జి వద్ద డంపింగ్ చేయడం జరిగింది. గతంలో కూడా పినపాక గ్రామస్థులు బ్రిడ్జి వద్ద డంపింగ్ చేయడం వలన వ్యవసాయ పొలాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసన తట్టుకోలేకపోతున్నారని ఆందోళన చేసిన సందర్భాలు ఉన్నాయి. అయినా కూడా వైరా నదిలోనే వైరా డంపింగ్ చేస్తున్నారు. దీంతో రోడ్లపై వచ్చే వాహనదారులు దుర్వాసనలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డంప్‌చేసిన స్థలంలో నిప్పు పెట్టడంతో వచ్చే పొగకు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

**-వైరా మున్సిపాలిటీల్లో దీర్ఘకాలిక సమస్యలు**
**-డంపింగ్ యార్డ్ సమస్య**
**-శివారు ప్రాంతాల పరిస్థితి అధ్వానం**
**-నూతన పాలకవర్గంపైనే ఆశలు**



**నూతన పాలకవర్గంపైనే ప్రజలు ఆశలు...**

వైరా మున్సిపాలిటీలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, వైస్ చైర్మన్ కట్ల సంతోష్, కౌన్సిలర్లపైప్రజలు ఆశలు పెట్టుకున్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి వేధిస్తున్న మేజర్ సమస్య డంపింగ్ యార్డ్‌తో పాటు పూర్తిస్థాయిలో వీధిలైట్లు ఏర్పాటు, డ్రైనేజ్ నిర్మాణాలు, రోడ్ల నిర్మాణాలు, దోమల నివారణకు పూర్తిస్థాయిలో పాగింగ్, దోమలు వృద్ధి చెందకుండా చూడడం, త్రాగునీటి సమస్య లేకుండా ఏర్పాటుతో పాటు పలు సమస్యలపై ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. నూతన పాలకవర్గం ప్రజలకు అనుకూలంగా సరైన పాలన అందిస్తుందని ప్రజలు కోరుకుంటున్నారు.

# మృతుని కుటుంబానికి బీమా చెక్కు అందజేత



ప్రజాపక్షం/వైరా: కొణిజర్ల మండలం తీగల బంజర గ్రామానికి చెందిన పల్లపు గోపాల్ స్థానిక ఎస్‌బిఐ సోమవారం బ్రాంచ్ అకౌంట్ కలిగి ఉన్నాడు. అతనికి ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి భీమాయోజన ఉంది. 2025 సంవత్సరం నవంబర్ నెలలో చనిపోయారు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి భీమా యోజన క్రింద రూ.2లక్షల పరిహారంను స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సోమవారం బ్రాంచ్ మేనేజర్ వేణు, అతని భార్య సైదమ్మకు శనివారం అందజేశారు. ఇదేవిధంగా అందరూ ఎస్‌బిఐలో ఉన్న అన్ని భీమాలను పట్టుకొని లబ్ది పొందాలని మేనేజర్ కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది భరత్, బ్యాంకు మిత్రులు రమేష్, కృష్ణయ్య, స్నేహ పాల్గొన్నారు.

# ఘనంగా ప్రారంభమైన కరుణగిరి పుణ్యక్షేత్ర యాత్ర మహోత్సవాలు



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని కరుణగిరిలో పుణ్యక్షేత్రంలో యాత్ర మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రారంభ సూచికగా బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్ పతాక ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సంఘ కాపరుల నడుమ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ నెల 27వ తేదీ నుంచి మార్చి 1వ తేదీ వరకు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు స్వస్థత ప్రార్థనలు జరుగుతాయి. కావున భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరుణగిరి డైరెక్టర్ జోసెఫ్, రెవరెండ్ ఫాదర్లు ఐజాక్, తప్పెటశౌరి, ఆంటోని, విజయ్, మత గురువులు, సిస్టర్లు, బ్రదర్లు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కార్మికుల హాజర్ రిజిస్ట్రార్‌ను పరిశీలించిన వైస్‌చైర్మన్ కట్ల సంతోష్



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాల్ వైస్‌చైర్మన్ కట్ల సంతోష్ శనివారం ఉదయం 10గంటలకు మున్సిపాల్ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ ఉన్న శానిటేషన్ అధికారి వీరన్నను పిలిపించి హాజరు రిజిస్ట్రార్ చూపించాలని అడగడంతో శానిటేషన్ అధికారి వీరన్న రిజిస్ట్రార్ చూపించాడు. ఎంతమంది కార్మికులు ఉన్నారు. ఎంతమంది పనికి వస్తున్నారని సంతోష్ ప్రశ్నించారు. దీంతో వీరన్న 61 మంది కార్మికులు ఉన్నారు. 14 మంది విధులకు రావట్లేదు అని తెలపడంతో వారు ఎందుకు విధులకు రావడం లేదని తెలుసుకున్న వైస్ చైర్మన్ సంతోష్ వాళ్ళతో మాట్లాడతాను, ఎందుకు రావడం లేదు అనే విషయాన్ని తెలుసుకుంటానని తెలిపారు. అదేవిధంగా ఎవరైనా విధులు రాకుండా జీతాలు తీసుకోవచ్చు అనే భావన ఉంటే వదిలేయండి ఎట్టి పరిస్థితుల్లో మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి అంటే తప్పనిసరిగా విధుల్లో పాల్గొనాలని సూచించారు. విధులకు రాకపోతే జీతాలు ఇవ్వడం జరగదని ఆయన అన్నారు. అందరం కలిస్తేనే అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. మున్సిపాల్ కార్మికులు అందరూ వారి యొక్క విధులను సక్రంగా నిర్వహించండి జీతాలు సక్రమంగా అందేందుకు మేము కృషి చేస్తామని అన్నారు.

# మున్సిపల్ చైర్మన్ ,వైస్ చైర్మన్‌లకు ఘన సన్మానం




ప్రజాపక్షం/సత్తుపల్లి: పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీ ఎన్‌సిసి పొలిటికల్ వింగ్ అధ్యక్షులు అలవాల కరుణాకర్ ఆధ్వర్యంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ రెహానా కమల పాషా, సత్తుపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ బొంతు సుమలత వేణు, కౌన్సిలర్లు జగన్నాథం శ్రీను ,శరత్ లను శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రెహానా కమల్ పాషా మాట్లాడుతూ నామీద ఇంత మంచి బాధ్యత పెట్టిన సత్తుపల్లి శాసనసభ్యులు మట్టా రాగమయి దయానంద్ కి ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.. క్రైస్తవ సమాజం అభివృద్ధి, క్రైస్తవ భవన నిర్మాణానికి సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ సహాయ సహకారాలతో నా వంతుగా కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో క్రైస్తవ సేవకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# టిడిఆర్‌పై అవగాహన సదస్సు



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరంలోని పిఎస్ఆర్ రోడ్డు ప్రాంత ప్రజలకు టిడిఆర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్పోరేషన్ కార్యాలయంలో మేయర్ పునుకొల్లు నీరజ ఆధ్వర్యంలో శనివారం టిడిఆర్‌పై అవగాహన కల్పించారు. టౌన్ ప్లానింగ్ ఏసిపి వసుంధర టిడిఆర్ విధానం దాని ప్రయోజనాలు, అమలు విధానం గురించి సమగ్రంగా వివరించారు. ప్రాంత అభివృద్ధి, ప్రణాళికల అమలులో టిడిఆర్ ముఖ్య పాత్ర పోషిస్తుందని ఆమె తెలిపారు. టిడిఆర్‌పై ప్రజలు పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచులు సుపరిపాలన అందించాలి

**-గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి**
**-సర్పంచుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో కలెక్టర్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సర్పంచ్‌లు సుపరిపాలన అందించి గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. డిపిఆర్‌సి సెంటర్‌లో నూతన సర్పంచ్‌లకు ఏర్పాటు చేసిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదంతో గ్రామాల్లో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. సర్పంచ్‌లకు పెద్ద బాధ్యత ఉంటుందని రాబోయే ఐదేండ్ల పాటు ప్రజలకు సుపరిపాలన అందించాలన్నారు. సర్పంచ్ విధి నిర్వహణలో తీసుకోవాల్సిన చర్యలు, కార్యాచరణపై ఈనెల 17 నుంచి 21 వరకు ఐదు రోజుల పాటు శిక్షణ అందించడం జరిగిందన్నారు. పంచాయతీ కనీస బాధ్యతలు కట్టుదిట్టంగా నిర్వహిస్తే ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తారన్నారు. గ్రామ పారిశుధ్యం పరిశీలించి సర్పంచ్ పాలక వర్గం, పంచాయతీ కార్యదర్శి పనితీరు చెప్పవచ్చునన్నారు. ప్రతి రోజు చెత్త సేకరణ, పారిశుధ్య నిర్వహణ ఎలా ఉంటుంది వంటి అంశాలను సర్పంచ్ పర్యవేక్షించాలన్నారు. గ్రామాల్లో పచ్చదనం పెంచేందుకు కృషి చేయాలని, గ్రామాభివృద్ధి పనులు ప్రణాళిక ప్రకారం చేపట్టాలన్నారు. అందుబాటులో ఉన్న నిధులు ఎలా ఖర్చు చేసుకోవాలో తగు కార్యాచరణ చేసుకోవాలన్నారు. పంచాయతీ పాలక వర్గ సమావేశాలు ప్రతి రోజు నిర్వహించి తీసుకున్న నిర్ణయాలను ఎప్పటికప్పుడు రికార్డు చేయాలన్నారు. సర్పంచ్‌లు అధికారులతో సమన్వయం చేసుకుంటూ గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. గ్రామాల్లో పన్ను వసూళ్లపై సర్పంచ్ శ్రద్ధ వహించాలని, ప్రతి ఒక్కరూ పన్ను కట్టేలా ప్రోత్సహించాలన్నారు. ఆర్థిక సంఘం నిధులు రూ. 33 కోట్లు జిల్లాలో గ్రామ పంచాయతీల్లో జమ అయ్యాయని వీటిలో రూ. 20కోట్లు గ్రామాల్లో పారిశుధ్యం, పంచాయతీ సిబ్బంది వేతనాలు, విద్యుత్ బిల్లులు వంటి టైడ్ గ్రాంట్ నిధులు, రూ. 13 కోట్లు అభివృద్ధి నిధులు ఉన్నాయని మార్చి 31 వరకు మరిన్ని నిధులు జమ అవుతాయన్నారు. ఆర్థిక సంఘం నిధులు దుబారా చేయకుండా సక్రమంగా వాడుకోవాలన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ పథకాల అమలు తీరు కూడా సరిగ్గా ఉందో లేదో దృష్టి సారించాలని ఎక్కడైనా సమస్యలు ఉంటే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి సర్పంచ్ కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, అధికారులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# రూపం ఒక్కటే.. దేహాలు వేరు..!

**-ట్విన్స్‌కు ప్రత్యేకం వేపకుంట్ల**
**-నేడు కవలల దినోత్సవం**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఒకే రూపం... ఒకే ఆలోచన... ఒకే అతృత... ఒకే ఆక్రోశం... ప్రేమ, దయ, కోపం అన్ని ఒక్కటే దేహాలు మాత్రం రెండు.... పుట్టక ఒక్కటే. జీవితాలు మాత్రం రెండు. రెండు దేహాలు ఒక్కటే రూపం ఇంతకంటే అపురూపం ఇంకేముంటుంది. కవల పిల్లలు పుడితే ఆ తల్లిదండ్రులు ఎంతో ఆనందంతో మురిసిపోతారు. ప్రపంచంలో మనుషులను పోలిన మనుషులు ఏడుగురు ఉంటారని చెబుతుంటారు. కానీ ఏడుగురినీ ఇంత వరకు ఎవరు చూసి ఉండరు. కానీ దేహాలు వేరైనా ఒకే రూపంతో ఉండే ఇద్దర్నీ మాత్రం ఎక్కడో ఒక చోట చూస్తునే ఉంటాం. వారినే కవలలంటాం.దేహాలు వేరుగా ఉన్న ఒకే రూపంతో వారు ఉండడం తల్లిదండ్రులు వారిని అదృష్టవంతులుగా భావిస్తుంటారు. వారిని ఎంతో అల్లారు ముద్దుగా అపురూపంగా చూసుకుంటారు. వారికి పెట్టే పేర్లు సైతం ఒకేలా ఉండేలా చూసుకుంటారు. రఘునాథపాలెం మండలంలోని వేపకుంట్ల గ్రామం ట్విన్స్‌కు ప్రత్యేకం. ఆ గ్రామంలో ఏకంగా తొమ్మిది మంది కవలలు ఉన్నారంటే అతిశయోక్తి కాదు. అందులో ఓ మహిళకు రెండు కాన్పుల్లో కవలలే జన్మించారు.గుగ్గిళ్ల సుధాకర్, కోటేశ్వరి దంపతులకు 2002లో కవలలు జన్మించారు వారికి రమ్య, లావణ్యలుగా నామకరణం చేశారు. కుర్రా టిటో, నాగశ్వేత దంపతులకు 2017లో కుర్రా సరయు, కుర్రా సూర్య కవలలు జన్మించారు. వీరి తాత కుర్రా భాస్కర్‌రావు, నాయనమ్మ లీలావతి, చావగాని శ్రీనివాసరావు, ఉపేంద్ర దంపతులకు 1999 సంవత్సరంలో కవలలు జన్మించారు. వారికి రాము, లక్ష్మణ్‌లుగా నామకరణం చేశారు.

# ఆళ్లపల్లిలో పెద్దపులి కలకలం..!

**-రేగళ్లరేంజ్ నుండి ఆళ్లపల్లి రేంజ్‌లోకి ప్రవేశించిన పులి**
**-పులి కోసం గాలింపు చర్యలు చేపట్టిన అటవీ శాఖ అధికారులు**







**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఆళ్లపల్లి మండలంలో పెద్ద పులి సంచారం కలకలం సృష్టించింది. ఆల్లపల్లి మండలం లక్ష్మీ పురం గ్రామ సమీపంలో పెద్దపులి సంచరిస్తున్నట్లు, రేగళ్లరేంజ్ నుండి ఆళ్లపల్లి రేంజ్ లోకి పులి ప్రవేశించిన అడుగు జాడలను ఫారెస్ట్ అధికారులు గుర్తించారు. ఈసందర్భంగా రేంజ్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ చింతలగుంపు(ఇ)బీట్‌లో, అనంతోగు బీట్ దిశలో దక్షిణం వైపు ఇంటెన్సివ్ ఫీల్డ్ పెట్రోలింగ్ సమయంలో నమోదైన స్పష్టమైన పగ్‌మార్క్ ఆధారాల ఆధారంగా ఆళ్లపల్లి రేంజ్‌లో పులి కదలిక నిర్ధారించడం జరిగిందన్నారు. ప్రాథమిక విశ్లేషణ ప్రకారం కదలిక పులి పిల్లగా అంచాన వేశామన్నారు. ప్రస్తుతం అటవీ శాఖ అధికారులు పులి కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఇంటెన్సివ్ కూంబింగ్ ఆపరేషన్లు, నిరంతరం గ్రౌండ్ ట్రాకింగ్, రౌండ్ ది క్లాక్ పెట్రోలింగ్‌ను ఫ్రంట్ లైన్ సిబ్బంది బలోపేతం చేశామని, కదలికను చురుకుగా పర్యవేక్షిస్తున్నామన్నారు. పక్కనే ఉన్న అన్ని బీట్‌లను హై అటలర్ట్‌లో ఉంచామన్నారు. రైతులు కూలీలు ఎవరూ వ్యవసాయం చేనులకు వెళ్లవద్దని, పశువుల కాపరులు అటవీ ప్రాంతం వైపు వెళ్లరాదని సూచించారు. గ్రామస్తులు ఒంటరిగా తిరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు ఏమైనా జంతువుల కదలిక సంకేతాలు కనిపిస్తే వెంటనే అటవీ శాఖకు తెలియజేయాలని, ప్రజల సహకారం చాలా అవసరమని, భయపడాల్సిన అవసరం లేదన్నారు. కానీ తగిన జాగ్రత్తలు తప్పక తీసుకోవాలని కోరారు.

## విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** మండల పరిధిలోని గణేశ్వరం యూ పిఎస్ పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఐదవ తరగతి గురుకుల ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ప్రముఖ దంత వైద్యులు రాజేష్ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రి ప్యాడ్, పెన్ను, పెన్సిల్, ఎరైజర్ వంటి వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం కె. విజయ, ఉపాధ్యాయులు ఎల్, గోపాలరావు లు మాట్లాడుతూ గత ఏడేళ్ల నుంచి 100 మందికి పైగా గణేశ్వరం పాఠశాల నుంచి గురుకులంలో సీటు సాధించారని తెలిపారు. విద్యార్థుల అభివృద్ధికి సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రఫీక్ పాషా, ఎన్. వెంకటేశ్వరరావు, విజయలక్ష్మి , కొర్రా శ్రీను, అంగన్‌వాడీ సిబ్బంది కౌసల్య, రాధ, సోమ్లి, ప్రియాంక, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వార్డు మెంబర్లకు గౌరవ వేతనం ఇవ్వాలని వినతి



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** వార్డు సభ్యులుగా గెలుపొందిన వారికి గౌరవ వేతనం ఇవ్వాలని పలువురు వార్డు సభ్యులు ఎంపిడివో అశోక్‌కుమార్, ఎంపివో శ్రీనివాసరెడ్డి లకు శనివారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు మాట్లాడుతూ పలు గ్రామాల నుంచి వార్డు సభ్యులుగా ఎన్నికైన తమకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సర్పంచ్‌లు మాదిరిగానే వార్డు సభ్యులకు గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. ఇట్టి విషయాన్ని కలెక్టర్, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం చేయాలని కోరారు. వార్డు సభ్యులుగా గ్రామ ప్రజలకు సేవ చేస్తున్న తమను ప్రభుత్వం గుర్తించి గౌరవ వేతనం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## పాఠశాల్లో మౌలిక వసతుల కల్పన



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల పరిధిలోని పువ్వాడ నగర్ ప్రాథమిక పాఠశాలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించారు. పాఠశాలకు మౌలిక వసతులు కల్పించాలని సర్పంచ్ షేక్ సిద్దిఖ్, ఎంఈవో రాములు, ప్రధానోపాధ్యాయులు శ్యాంసుందర్ వినతుల మేరకు ప్రభుత్వం నుంచి పాఠశాలకు అవసరమైన వసతులు సమకూర్చారు. విద్యార్థులు కూర్చునేందుకు బెంచీలు, కుర్చీలు, ఇతర ఫర్నీచర్‌ను శనివారం పాఠశాలకు అందజేశారు. సర్పంచ్ సిద్దిఖ్ వాటిని పరిశీలించారు. స్పందించి వసతులు సమకూర్చిన కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిదిలోని సత్యంపేట గ్రామానికి చెందిన ద్విచక్ర వాహనదారుడు తోట కృపారావు రంగులు వేసే పని నిమిత్తం సత్తుపల్లికి వస్తుండగా,సత్తుపల్లి సమీపంలో ఎదురుగా వస్తున్న మరొక ద్విచక్ర వాహనాన్ని ఢీకొని కింద పడిపడి తీవ్రంగా గాయపడటంతో విషయాన్ని సత్తుపల్లి 108 సిబ్బందికి సమాచారం అందించగా,ఈఎంటి ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ గొల్ల మందల కృష్ణ,పైలెట్( డ్రైవర్) ఏకాంత్ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని,క్షతగాత్రుడికి కాలు తొడ ఎముక విరిగిపోయినట్లు గమనించి, ఆధునిక వైద్య విధానంలో స్ప్లింటింగ్ ,మెడ పట్టి పెట్టి, సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. 108 సిబ్బందిని పలువురు అభినందించారు.